క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

మదనపల్లె రూరల్ : విద్యుత్ సంస్థ కేంద్ర జేఏసీ ఆదేశాల మేరకు ఉదయం 9 గంటలకు అన్నమయ్యజిల్లా కేంద్రం రాయచోటి సర్కిల్ ఆఫీసు నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని మదనపల్లె డివిజన్ విద్యుత్ జేఏసీ నాయకులు తెలిపారు. ఆదివారం విద్యుత్ జేఏసీ నాయకులు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...రాయచోటిలో జరిగే విద్యుత్ ఉద్యోగుల ర్యాలీకి మదనపల్లె డివిజన్‌లోని ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్స్, కాంట్రాక్ట్ ఆపరేటర్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్, డిపార్ట్‌మెంట్ నందు పనిచేసే ఉద్యోగులందరూ హాజరై విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు సయ్యద్ జాఫర్‌వలీ, రామలక్ష్మయ్య, మురళీ, రామకృష్ణ, శేషాద్రినాగరాజు, రామచంద్రనాయక్, షేక్ జాఫర్‌వలీ కోరారు.

రాయచోటికి మరిన్ని ఆర్టీసీ సర్వీసులు కల్పించాలి

కలికిరి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి చౌడేపల్లి నుంచి సోమల, కలికిరి మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని సోమల, కలికిరి మండల ప్రజలు ఆర్టీసీ అధికారులకు విన్నవించుకుంటున్నారు. పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి రాయచోటికి ప్రస్తుతం ఒకటి రెండు సర్వీసులు మాత్రమే నడుస్తున్నాయని, ప్రజల రవాణాకు అనుగుణంగా అధికారులు మరో రెండు సర్వీసులను కేటాయించాలని వినతిలో పేర్కొన్నారు. దసరా సెలవుల దృష్ట్యా కూడా రద్దీ పెరుగుతుందని, ఆర్టీసీ అధికారులు స్పందించి పుంగనూరు–రాయచోటి మార్గంలో కొత్త సర్వీసులు కల్పించాలని కోరారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీస్‌లో స్త్రీశక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్య కొండకు చేరుతాయన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

మూర్ఛరోగులకు ఉచిత వైద్యసేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివన్నారాయణ

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఆదివారం ఉచిత మూర్ఛవ్యాధి వైద్య శిబిరం నిర్వహించారు. జీబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రెండు నెలలకు ఒకసారి ఉచిత వైద్యశిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు కార్యదర్శి ఉదయమోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిషివాటిక కేసులో సెక్షన్ మార్పు

బి.కొత్తకోట: ఈనెల ఏడున మండలంలోని రిషివాటిక గురుకులంలో జరిగిన ఘటనలో లక్కిరెడ్డిపల్లి మండలానికి చెందిన విద్యార్థి శేషాద్రిరెడ్డి (11) కంటికి తీవ్రమైన గాయమైన విషయం తెలిసిందే. తండ్రి అమరనాథరెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో కంటికి తీవ్ర గాయం కావడంపై కేసులో సెక్షన్‌ను మార్పు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

8 గంటల పనిదినం కోసం పోరాటాలు



మాట్లాడుతున్న ఉదయ్‌కిరణ్

రాయచోటి జగదాంబసెంటర్ : ఎనిమిది గంటల పనిదినం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్‌కిరణ్ అన్నారు. రాయచోటిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం అన్నమయ్య జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చెన్నయ్య, రమణ, వెంకటేష్, రఘునాథనాయుడు, మహిళా సంఘం నాయకురాలు సుజాత, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి తుమ్మల లవకుమార్, పెద్దన్న పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు వేళాయె

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నేటి నుంచి ఉత్సవాలు



దసరా ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం



విద్యుత్‌దీపాల అలంకరణలో చౌడేశ్వరి ఆలయం

మదనపల్లె సిటీ: దేవి శరన్నవరాత్రులకు మదనపల్లెలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని శ్రీవాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పిస్తారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలితత్రిపురసుందేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో చేయనున్నారు. 22న లలిత త్రిపురసుందరిదేవి అలంకారం, 23న విష్ణుదుర్గ, 24న వారాహిదేవి, 25న శ్రీ కాత్యాయనిదేవి, 26న శ్రీరాజశ్యామలాదేవి, 27న భువనేశ్వరి దేవి, 28న అన్నపూర్ణ, 29న సరస్వతి, 30 శ్రీ దుర్గాదేవి,అక్టోబర్ 1న శ్రీ మహాలక్ష్మి, 2న శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం కల్పిస్తారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలో శ్రీ చౌడేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలకు ఆలయం ముస్తాబు చేశారు. రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుంటారు. 23న పసుపు, 24న కంకుమ, 25న కనకదుర్గ, 26న వెండి కవచం, 27న అన్నపూర్ణేశ్వరి, 28న శాకాంబరి, 29న సరస్వతి, 30న మహిషాసుమర్థిని, అక్టోబర్ 1న ధనలక్ష్మి, 2న రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయ కమిటీ దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవార్లను వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం కల్పిస్తారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శ్రీరాజరాజేశ్వరి ఆలయం, బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పిస్తారు. కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

కలికిరి: దసరా ఉత్సవాలకు మండలంలోని ప్రధాన ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో వెలసిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్న పార్వతీదేవికి సోమవారం నుంచి అక్టోబరు నెల 3వ తేదీ వరకు ప్రత్యేక అలంకరణలు, అభిషేకాదులు నిర్వహించడ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 3న అమ్మవారి గ్రామోత్సవం, నిమజ్జనం జరుగనుందని, భక్తాదులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



కలికిరి: దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్న పార్వతీసమేత సోమేశ్వరాలయం

నేటి నుంచి శ్రీలక్ష్మీనరసింహుడి పవిత్ర ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు గోపాలా బట్టర్ ఆదివారం తెలిపారు. ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు స్వామివారి పవిత్ర ఉత్సవాలను టీటీడీ వారు వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏటా పవిత్ర ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ . స్వామివారికి నిత్యం చేసే పూజా పురస్కారాల్లో సకల దోషాలను నివారింప జేయుటకు గానూ పవిత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు నిర్వహించడం వలన యజ్ఞఫలాలను అందించడమే కాకుండా సర్వాభీష్టములు సిద్ధింపజేసి, ఆత్మ, శరీరం, ఇంద్రీయాలు, వాక్కు, ఖర్మలను పవిత్రంగా చేస్తుంది. ఈనేపథ్యంలో స్వామివారి పవిత్ర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న అంకురార్పణ, 23న పవిత్ర మాలల ప్రతిష్ఠ, స్నపన తిరుమంజనం, యాగశాల కైంకర్యములు, 24న పవిత్రమాలల స్వామివారికి సమర్పన, యాగశాలకైంకర్యములు, ఈనెల25న మహాపూర్ణాహుతి, కుంభప్రదక్షిణ,పవిత్ర వితరణ, చక్రస్నానం, తిరువీధి ఉత్సవాలు నిర్వహించనున్నారు. పవిత్ర ఉత్సవాల సేవల్లో పాల్గొనే దంపతులు రూ. 300 చెల్లించి స్వామివారి సేవల్లో పాల్గొనవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయం

అన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాతలతో ట్రస్టు సభ్యులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ అన్నదానట్రస్టు షెడ్డు నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం అన్నదాన ట్రస్టు భవనంలో అధ్యక్షులు రాజశేఖరరెడ్డి అధ్వర్యంలో ట్రస్టు సమావేశం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కర్మిషా హిల్స్ అధినేతలు రవికుమార్, ప్రసన్నకుమార్‌లు రూ.1.70 లక్షలు, గుండ్లపల్లి పంచాయతీ వేపలపల్లికు చెందిన ముద్ర వెంకటరమణారెడ్డి కుమారుడు గంగాధర్‌రెడ్డి రూ.1.70 లక్షలు, వేపలపల్లె అంగడి నారాయణస్వామిరెడ్డి రూ.10,111 విరాళం అందజేశారు. వీరి దాతృత్వానికి కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, సభ్యులు పుల్లారెడ్డి, రెడ్డప్పరెడ్డి, రమణారెడ్డి, దాతలు భద్రి, పుట్టాశేఖర్‌గుప్తా, మురళి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఎస్సీలకు న్యాయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలకడ : జగన్నతోనే ఎస్సీలకు న్యాయం, వైఎస్సార్‌సీపీలో సముచిత న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండలశాఖ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజులు, ఉపాధ్యక్షుడు కొమ్మ నటరాజ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సమానత్వం పాటించారని గుర్తు చేశారు. అప్పటి వైఎస్సార్ పాలనకు–నేటి కూటమి పాలనకు నేడు బేరీజు వేసుకోవాలని ఎస్సీలను కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసమే విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేశారంటే జగనన్నకు ఎస్సీలపై ఉన్న అభిమానం, అంకిత భావం ఎలాంటిదో ప్రతి ఎస్సీ, ప్రతి ఎస్టీ గుర్తుపెట్టుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన కక్ష రాజకీయాలు ఎంతో కాలం చెల్లవన్నారు. దళితులపై దాడులు కొనసాగవని, దళితులకు వైఎస్సార్ సీపీ వెన్నంటి ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, ఓబులేశు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే ..చెరువై పోతుంది

– శేషప్పతోట కాలనీవాసుల ఇబ్బందులు



శేషప్పతోట కాలనీలో పొంగిపొర్లుతున్న మురుగునీరు

మదనపల్లె సిటీ: చిన్నపాటి వర్షం పడితే చాలు కాలనీ చెరువైపోతుంది. వర్షపునీరుతో పాటు మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని శేషప్పతోటకాలనీలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలనీలోని వీధులు నీటి మడుగులా తయారయ్యారు. స్థానిక ఎస్‌జెఆర్ కళ్యాణమండపం వద్ద వర్షపునీరు కాలువల్లో ప్రవహించకపోవడంతో మురుగునీరు మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోని వీధుల్లోకి పొంగిపొర్లుతున్నాయి. కాలనీలోని ఇళ్ల ముందు మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనకు ప్రజలకు అల్లాడిపోతున్నారు. దీంతో పాటు మిషన్‌కాంపౌండ్ పొడవునా మురుగునీరు నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. ఈ విషయంపై పలుసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశామనా శేషప్పతోట రెసిడెన్సీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు తెలిపారు. మున్సిపల్ అధికారులు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు.

ప్రమాదకరంగా గూడరేవుపల్లె బ్రిడ్జి



గూడరేవుపల్లె బ్రిడ్జి

పీలేరు రూరల్ : మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ పీలేరు – తలపుల రోడ్డులో గూడరేవుపల్లె సమీపంలో ఉన్న వంకపై బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలకు బ్రిడ్జి పాక్షికంగా దెబ్బతింది. ఇదే బ్రిడ్జి వద్ద ఆటోలు అదుపు తప్పి వాగులోపడి కొట్టుకు పోయిన సంఘటనలు జరిగాయి. ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ప్రవహించడంతో బ్రిడ్జి కింద నీరునిల్వ పుష్కలంగా ఉంది. ఈ బ్రిడ్జిపై వాహనదారులు ప్రాణం అరచేతిగుప్పిట్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు. ఈ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

హైవేపైనే టమాటాల లోడింగ్

– పొంచి ఉన్న ప్రమాదాలు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండకు సమీపంలోని మార్కెట్ యార్డు, కండ్రిగ గ్రామాల పరిధిలో ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిపైనే టమాటాల లోడింగ్ చేపడుతుండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పలువురు వ్యాపారులు రైతుల దగ్గర నేరుగా టమాటాలను కొనుగోలు చేస్తున్నారు. స్థానిక మార్కెట్ యార్డు దగ్గరలోనే ఉన్నా వ్యాపారులు రోడ్లపైనే టమాటా క్రేట్లను వాహనాల నుంచి అన్‌లోడింగ్ చేపడుతున్నారు. జాతీయ రహదారిపైన ఉన్న కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు పలుచోట్ల రోడ్లపైనే టమాటా క్రేట్లు స్టాకు ఉంచుకొంటున్నారు. ఈపద్ధతితో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. టమాటాలు వాహనాల్లో నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేపట్టే సమయాల్లో జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలు ఢీకొట్టే ప్రమాదముందని గ్రామస్తులు అంటున్నారు. అసలే రద్దీగా ఉన్న ఈ జాతీయ రహదారిపై అడ్డదిడ్డంగా టమాటా క్రేట్లు ఉంచుతుండడం గమనార్హం. మరోవైపు మార్కెట్‌యార్డు దగ్గర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వ్యాపారులు మార్కెట్‌యార్డులోగానీ, రోడ్డుకు కొంతదూరంలోని మైదానాల్లోగానీ టమాటాల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ చేపడితే బాగుంటుందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.



కండ్రిగ గ్రామం వద్ద జాతీయ రహదారిపై లోడింగ్ కోసం సిద్ధంగా టమాటా క్రేట్లు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

నిమ్మనపల్లె : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయాలనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్నీ ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులు యోగానందరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మదనపల్లె మెడికల్ కాలేజీ దాదాపు 70శాతానికి పైగా పనులు పూర్తిచేసుకుందన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి తరగతులు ప్రారంభించేలా జిల్లా ఆస్పత్రిని బోధనాసుపత్రిగా మార్చడమే కాకుండా తాత్కాలిక భవనాల నిర్మాణం పూర్తిచేయడం జరిగిందన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెడికల్ కాలేజీ ప్రారంభిస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో పెండింగ్ పనులు జరపకుండా నిలిపివేశారన్నారు. మెడికల్ కాలేజీ అందుబాటులోకి వస్తే పేదలకు మెరుగైన వైద్యం అందడమే కాకుండా పేద విద్యార్థులకు వైద్యవిద్య అభ్యసించే అవకాశం దక్కేదన్నారు. ప్రైవేటీకరణతో వైద్యవిద్య ఖరీదవడమే కాకుండా, పేదలకు వైద్యసేవలు భారమవుతాయన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



మొబైల్ వ్యాన్ వద్ద ప్రచారం చేస్తున్న కృషి సంస్థ ప్రతినిధులు

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు నిర్భయంగా చేసుకోవాలని కృషి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత సర్కిల్ వద్ద హెచ్ఐవీ నివారణపై మొబైల్ వ్యాన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ ఎలా వస్తుంది? వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని ఐసీటీసీలో పరీక్షల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం చంద్రనాగమ్మ, ఓఆర్‌డబ్ల్యూలు జాబీర్, సావిత్రి, గాయిత్రి, పల్లవి పాల్గొన్నారు.

కళతప్పిన హార్సిలీహిల్స్

బి.కొత్తకోట: వారాంతంలో రద్దీగా ఉండే పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై సందర్శకులు కరువై కళ తప్పింది. ప్రతి శని, ఆదివారాల్లో కొండపైకి పొరుగు రాష్ట్రాలనుంచి సందర్శకులు వస్తారు. అయితే ఈ వారం సందర్శకుల తాకిడి లేదు. అతిథిగృహాలు ఖాళీగా ఉంటున్నాయి. రోడ్లుకూడా నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

పెద్దతిప్పసముద్రం: పాఠశాలలకు అక్టోబర్ 2 వరకు దశరా సెలవులు ప్రకటించినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా శెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ స్పష్టం చేశారు.

రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. చల్లంగా చూడు తల్లీ అంటూ అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.

వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్



మధురిమను సత్కరిస్తున్న వైద్యులు

పీలేరురూరల్ : పట్టణానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు గుప్తా, డాక్టర్ మమతా లక్ష్మీ కుమార్తె వైద్యవిద్యార్థిని మధురిమ ఆల్ ఇండియా స్థాయిలో గోల్డ్ మెడల్ లభించింది. ఎంబీబీఎస్ ఆప్తమాలజీ విభాగంలో ఆమె గోల్డ్ మెడల్ సాధించింది. ఆమెను ఆదివారం పీలేరు ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజాసాహెబ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధురిమ గోల్డ్‌మెడల సాధించడం హర్షనీయమన్నారు. వైద్యవృత్తిలో ఆమె మరింత రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న పెద్దేరు ప్రాజెక్టు



మొరవపోతున్న పెద్దేరు ప్రాజెక్టు

4,500 ఎకరాలకు సాగునీరు

తంబళ్లపల్లె: మండలంలో మాజీ ఎమ్మెల్యే గట్టు నరసింగరావు కృషితో కొటాల పంచాయతీలో పెద్దేరు ప్రాజెక్టు నిర్మించారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు పెద్దేరు ప్రాజెక్టు నిండి ఆదివారం మొరవపోయింది. ఈ ప్రాజెక్టులో 15.70 మీటర్ల నీటి మట్టం ఉంటుంది. ఈ ప్రాజెక్టు నీటితో తంబళ్లపల్లె మండలంలోని గోపిదిన్నె, కొటాల,ఆర్ఎన్ తాండా, జుంజురుపెంట, పెద్దమండ్యం మండలంలోని మందలవారిపల్లె, బండ్రేవు, ముసలికుంట, దిగువపల్లె పంచాయతీల్లోని సుమారు 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ నీటితో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో కూడా నీటి పెరిగి సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రంగమ్మ చెరువుకు జలకళ



అంగళ్లు బైపాస్ పక్కన నిండు కుండలా రంగమ్మ చెరువు



రంగమ్మ చెరువు కట్టపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కట్టపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కురబలకోట: కొండల వద్ద ప్రకృతి ఒడిలో అంగళ్లు బైపాస్ పక్కన ఉన్న రంగమ్మ చెరువుకు కృష్ణమ్మ కళ ఉట్టిపడుతోంది. హంద్రీనీవా జలాలతో పాటు ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు చెరువు సులభంగా నిండి మొరవ కూడా పోతోంది. దీంతో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. సెల్ఫీలు, వీడియోలతో పాటు రీల్స్ తీయడం చేస్తున్నారు. బైపాస్ పక్కన కావడంతో జన సంచారం కూడా పెరిగింది. దీంతో భద్రత దృష్ట్యా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోనే ఇది పెద్ద చెరువు కావడం ఆపై బైపాస్ పక్కన ఉండడంతో తహసీల్దారు ధనుంజయులు ముందుస్తుగా ఆదివారం స్థానిక వీఆర్వో ఖాదర్‌బాషా ద్వారా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. చెరువు నిండింది..ప్రజలు చూడటం సంతోషకరమే. కానీ అనవసర రిస్కులు తీసుకోవద్దని సూచించారు. చెరువు నీటి మట్టం పెరుగుతుండడంతో కట్టపై వాహనాలకు అనుమతి లేదని సందర్శకులు జాగ్రత్తగా రాకపోకలు సాగించాలని తెలిపారు. పరిసర గ్రామాల వారు ఆయకట్టు రైతులు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొరవ నీరు బ్రాహ్మణఒడ్డుపల్లి మీదుగా మదనపల్లి రూరల్ మండలం సీటీఎం చెరువుకు వడివడిగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నాయి. రైతాంగం పరిసర ప్రాంతాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు దేవర నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నట్లు ఆయకట్టు రైతులు తెలిపారు.